ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 7 డిసెంబరు 2024 | 7







పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం సమర్పిస్తున్న హోంగార్డులు

← (ఇన్‌సెట్)లో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



పల్లెలు..డిజిటల్!

ఇక పంచాయతీల్లో సేవలన్నీ ఆన్‌లైన్

ప్రపంచం అంతా మారిపోయింది.. డిజిటల్ వైపు పరుగులు పెడుతోంది.. ప్రస్తుతం రూపాయి చెల్లించాలన్నా ఆన్‌లైన్.. అయితే పంచాయతీల్లో మాత్రం ఇప్పటి కింకా పాత పద్ధతే. ఏ సేవ కావాలన్నా మాన్యువల్‌గా దరఖాస్తు చేయాల్సిందే.. వాళ్లూ అదే స్థాయిలో మాన్యువల్‌గా ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1103 పంచాయతీలు ఉండగా అన్నింటా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక ఏ సేవ అయినా ఆన్‌లైన్‌లోనే. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.. ఈ సేవలు జనవరి నుంచి అమల్లోకి వస్తాయి.

- జనవరి నుంచి డిజిటలైజేషన్
- జిల్లాలో 1103 పంచాయతీలు
- స్వర్ణ పంచాయతీల్లో అమలు
- ప్రజలకు వేగంగా సేవలు
- ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణపత్రాలు
- ఎక్కడి నుంచైనా పన్నులు చెల్లింపు
- మారనున్న పంచాయతీ పాలన
- కార్యదర్శులకు డిజిటల్ కీ
- త్వరగా సర్టిఫికెట్ల జారీ

కార్పొరేషన్(కాకినాడ)/మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇకపై డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు రెండు, మూడు రోజుల్లోనే జారీ కానున్నాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు.. వ్యాపార లైసెన్సులు పొందొచ్చు.వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి రానుంది.దీంతో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌క్లియర్‌గా ఉండనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి.అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీ చేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షించాల్సిన అవసరంలేదు. సులభంగా సర్టిఫికెట్లు పొందేలా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కొత్తవిధానానికి శ్రీకారం చుట్టింది. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని కార్యదర్శులు పరిశీలించి డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం మీసేవ నుంచి సర్టిఫికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు.

కొత్త విధానం ఇలా..

పంచాయతీల ద్వారా జనన,మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలోనే జారీ చేస్తున్నారు. కొత్త విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నెంబర్‌కి దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. పత్రం సిద్ధం కాగానే దరఖాస్తుదారుడి ఫోన్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది.కొత్త విధానం అమల్లోకి రావడంతో పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. రెండు, మూడ్రోజుల వ్యవధిలో సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ఎక్కడి నుంచైనా చెల్లింపులు..

ప్రపంచంలో ఎక్కడ, ఏమూల ఉన్నా మీ సొంత ఊళ్లోని మీ ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించాలంటే ఇక పంచాయతీ వరకు వెళ్లనక్కర్లేదు. ఉన్నచోటు నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లించవచ్చు. జనవరి నుంచి స్వర్ణ పంచాయతీల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇలా పలు సేవలను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. ఈమేరకు పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటితో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బకాయిలు చెల్లించచ్చు. మరికొన్ని చోట్ల క్యూఆర్ కోడ్ ద్వారా పన్ను బకాయిలు వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఆయా పంచాయతీల పీడీ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజలకు సత్వరం సేవలందించే ఉద్దేశంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం డిజిటల్ పంచాయతీలను అభివృద్ధి చేసి ఒక పోర్టల్ తీసుకొచ్చింది. దీని నిర్వహణను అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐ సీ)కి అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ఐసీ నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ మూలనపడింది. దీంతో ఐదేళ్లపాటు పంచాయతీల డిజిటలైజేషన్ మూలన పడింది. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, సేవల సంస్థకు అప్పగిస్తోంది.ఈ నేపథ్యంలో జనవరి నుంచి అమల్లోకి రానుంది. ఇక గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.

కార్యదర్శుల వివరాలు సేకరణ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్‌తో నమోదు చేశారు. డిజిటల్ టోకెన్లను జారీ చేయడానికి కార్యదర్శుల డిజిటల్ సంతకాలు, వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ సేకరించారు. ప్రతి కార్యదర్శికి సంబంధించి సమగ్ర వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే డిజిటల్ సంతకాల సేకరణ పూర్తి కాగా కార్యదర్శులకు డిజిటల్ కీలను జిల్లా ఉన్నత అధికారులు అందజేశారు.



తొలి దశలో ముఖ్యమైన సేవలు

పంచాయతీల్లో తొలిదశలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లోనే అందించనున్నారు. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్‌లో అందించనున్నారు. పంచాయతీల్లో అందించే 80 సేవలను క్రమంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్లో అందుబాటులో పెట్టనున్నారు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు 80 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి.

సమాజ శ్రేయస్సు కోసం.. హోంగార్డుల పాత్ర ఎంతో కీలకం

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- ఘనంగా హోంగార్డుల అవతరణ దినోత్సవం

కాకినాడ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు, అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సమాజ శ్రేయస్సుకోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి హోంగార్డులు అందిస్తున్న సేవలు మరువలేమని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో 62వ హోంగార్డ్సు యూనిట్ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోంగార్డ్సు అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏఎస్పీ అడ్మిన్ ఎంజేవీ భాస్కరరావు, అదనపు ఎస్పీ ఏఆర్ ఎస్.శ్రీనివాస్, హోంగార్డ్సు డీఎస్పీ కేఎస్ఎస్ శ్రీనివాస్, హోంగార్డ్సు ఆర్ఐ కె.వెంకటరావు పర్యవేక్షణలో హోంగార్డ్సు పరేడ్ కమాండర్ కె.రాజేష్‌నాయుడు పరేడ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ విక్రాంత్‌పాటిల్ హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్లటూన్లవారీగా జిల్లా ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం హోంగార్డులను ఉద్దేశించి ఎస్పీ ప్రసంగించారు. పోలీసుశాఖతో సమేకమై ప్రజలకు నిస్వార్థ సేవలు అందించడంలో హోంగార్డులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ ఏడాది సాధారణ ఎన్నికలకు హోంగార్డులు హాజరై అత్యంత సమర్థంగా విధులు నిర్వహించారన్నారు. విధినిర్వహణలో ఏళ్ల తరబడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు హోంగార్డులు, కంపెనీ కమాండర్ పదోన్నతి పొందిన ఆరుగురు హోంగార్డులను ఎస్పీ సత్కరించి మెమెంటోలు అందించారు. ఆర్ఐలు వెంకట్రావు, నరసింహమూర్తి, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, టౌన్ సీఐలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశానికి అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అరుదైన వ్యక్తి అని ఆయన దేశానికి చేసిన సేవలు ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం జంక్షన్‌వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ మహామేధావిగా, సంఘ సంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, ఇన్‌చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి లల్లీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ డీడీ నాగార్జున పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీపై రెండోరోజు రాష్ట్రస్థాయి సదస్సు 9
కాకినాడలో శస్త్ర చికిత్సల స్పెషల్ బస్సు
కృష్ణా జిల్లాకు.. క్యూ కట్టిన లారీలు 9



రోడ్లకు.. మహర్దశ!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దృష్టి
- ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు
- రూ.127.48 కోట్లు మంజూరు
- 407 పనులకు టెండర్లు
- 377 పనులు ప్రారంభం
- కోడ్‌తో ఆగిన 30 పనులు
- 13, 16 తేదీల్లో రీటెండర్లు
- జనవరి నెలాఖరుకు గడువు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతు పనులు ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లను పిలవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా 30 ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులకు టెండర్లకు ఆహ్వానం పలకనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.127.48 కోట్లతో 407 పనులు చేయాలని ఎన్నికల కోడ్‌కు ముందు టెండర్లను ఆహ్వానించారు. కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు రావడంతో 377 పనుల వరకు ఖరారు చేశారు. వీటిలో తొలి ఫేజ్‌లో 172 రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. తర్వాత ఫేజ్‌లో మిగిలిన 205 పనులను మొదలుపెట్టారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో 30 పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పనులకు ఈనెల 13,16వ తేదీల్లో టెండర్లకు ఆహ్వానం పలకాలని ఆర్‌అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ముగియనుంది. దీంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టెండర్లను పిలుస్తున్నారు. టెండర్లు పిలిచిన తర్వాత అగ్రిమెంట్లు చేసుకుని ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టనున్నారు.

గత ప్రభుత్వంలో అధ్వానం..

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు మరమ్మతు పని కూడా చేయలేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా దర్శనమిచ్చాయి. ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం పడితే గుంతల రోడ్లపై ప్రయాణించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. ఐదునెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దశ మారింది. రోడ్ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు విడుదల చేశారు. దీంతో రోడ్లపై గతుకుల బాధ తప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి.

తుఫాన్ల వల్ల జాప్యం

గత రెండు నెలల్లో సంభవించిన తుఫాన్ల వల్ల మరమ్మతు పనులు చేయడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల కొంతవరకు జాప్యం జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల పనుల వేగం పెరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ విషయమై కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కంఠును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా పెండింగ్‌లో ఉన్న పనులకు కోడ్ ముగిసిన వెంటనే టెండర్లు పిలుస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా మొత్తం మరమ్మతు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ పనులు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి నిర్దేశిత సమయానికి ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



'పది'కి 100 రోజుల ప్రణాళిక

- ఉత్తీర్ణతాశాతం పెంచే ప్రయత్నం
- డిసెంబరు 1 నుంచి ప్రారంభం
- మార్చి 10 వరకూ అమలు
- ఇప్పటికే పాఠశాలల్లో యాక్షన్ ప్లాన్

కాకినాడ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి తన జీవితంలో పదో తరగతి పరీక్షలు చాలాకీలకం. ఆ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే వారు తమ ఆసక్తిని బట్టి వివిధ రకాల కోర్సుల్లో చేరతారు. అంతటి విలువైన పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఎన్నో జాగ్రత్తలు అవసరం. కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ 100రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఇప్పటికే విడుదల చేసింది. పాఠశాలల్లో డిసెంబరు 1న ప్రారంభించిన ఈ ప్రణాళికను మార్చి 10 వరకూ అమలుచేయనున్నారు. విద్యార్థులు మెరుగైనఉత్తీర్ణత, అధికమార్కులు సాధించేలా ఈ ప్రణాళికను జిల్లావిద్యాశాఖాధికారులు ఈనెల 1 నుంచి పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఆదేశాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే జారీ చేశారు.

జిల్లాలో ఎంతమందంటే..

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొత్తం 18,300మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారిలో బాలురు 8700మంది బాలికలు 9600 ఉండగా బాలురకంటే బాలికలు ఎక్కువ శాతం ఉండడం గమనార్హం. వారంతా మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు స్టేట్ సిలబస్ ఆధారంగానే పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో డీసీఈబీ ద్వారా ప్రణాళిక రూపొందించి ఇచ్చేవారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలోనే తయారు చేసిన పరీక్ష ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించనున్నారు.

- కాకినాడ అర్బన్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలలనుంచి మొత్తం 2300మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానుండగా 1291మంది బాలురు, 1009మంది బాలికలున్నారు. కాకినాడ రూరల్ మండలంలోని పాఠశాలలనుంచి 1350మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానుండగా వారిలో 686మంది బాలురు, 666 మంది బాలికలున్నారు.

రోజువారీగా ప్రణాళిక అమలు ఇలా..

- ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ 6 పీరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాలి.
- ఆరోపీరియడ్‌లో విద్యార్థులకు పరీక్షను నిర్వహించాలి. స్టడీ అవర్స్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేక సీసీఎల్ మంజూరు చేస్తారు.
- ప్రతిరోజూ సబ్జెక్ట్ నిపుణులు తయారుచేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని సంబంధిత విద్యార్థులతో పరీక్ష రాయించాలి.
- ఈనెల 9 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతాయి. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి స్థాయిని నిర్ణయిస్తారు. ఏబీసీడీ వర్గాలుగా విభజించి చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తారు.
- ఇప్పటివరకూ నిర్వహించిన అంతర్గత పరీక్షల మార్కుల వివరాలను ఈనెల 7న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో అందిస్తారు. దీనికోసం ప్రభుత్వం హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ప్రింట్‌చేసి ఇప్పటికే సరఫరాచేసింది.
- తరగతిలోని 6నుంచి 8మంది విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుంటారు. అలాతీసుకున్న విద్యార్థులు ఉత్తమమైన మార్కులు సాధించేందుకు అవసరమైన మెళకువలను నేర్పుతారు.

ప్రతి పాఠశాలలోనూ ఆచరించాలి

-పిల్లి రమేష్, కాకినాడ డీఈవో


ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రణాళికను ప్రతి పాఠశాలలోనూ తప్పనిసరిగా అమలు చేయాలి. పదో తరగతి పరీక్షలకు సంబంధించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. ఎవరైనా స్వచ్ఛందంగా స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు అల్పాహారం అందించాలనుకుంటే అందించవచ్చు. ఈనెల 7న తల్లిదండ్రుల సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహిస్తాం.

తాటిపర్తిలో షష్ఠి వెలుగులు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో శుక్రవారం రాత్రి అలంకరించారు. షష్ఠి సందర్భంగా ఆలయానికి వచ్చే మార్గాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.







షష్ఠి సందర్భంగా తాటిపర్తిలో ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణలు

రేపు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కాకినాడ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 2024-25కు సంబంధించిన పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. కాకినాడ జిల్లాలో 14 పరీక్షాకేంద్రాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరుగుతుందన్నారు. కాకినాడ డివిజన్‌లో 8, పెద్దాపురం డివిజన్‌లో 6 పరీక్షాకేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. మొత్తం ఈ పరీక్షకు 3789 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారన్నారు.

నేడు మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు

- పార్టీలకు అతీతంగా హాజరుకావాలన్నదే లక్ష్యం
- ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంత్రి లోకేశ్ లేఖలు
- దేశంలోనే తొలిసారిగా ఒకే రోజు సమావేశాలు

సామర్లకోట,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రుల మధ్య ఓ ఆత్మీయ వారధి నిర్మించాలన్న సదుద్దేశంతో ఈ నెల 7న శనివారం నిర్వహించ నున్న మెగా పేరెంట్-టీచర్ సమావేశాలకు అంతా సమాయత్తమయ్యారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలని, దీనికి అందరూ హాజరు కావాలనికోరుతూ రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ లేఖలు పంపారు.

లక్ష్యం ఇదే..

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభ్యసనా సామర్థ్యాలు, క్రీడలు, విద్యార్థులకు కళలపట్ల ఉన్న ఆసక్తి తదితర అంశాలను ఉపాధ్యాయుల సమక్షంలో గుర్తించి చర్చిస్తారు. విద్యార్థులు మరింత పరిణితి చెందేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలను సైతం చర్చిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడం ప్రధాన లక్ష్యం కాగా పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి, పాఠశాలల అభివృద్ధికి విరాళాలిచ్చే తల్లిదండ్రులు, దోహదపడే పూర్వ విద్యార్థులు, స్వచ్ఛందసేవా సంస్థల్ని భాగస్వామ్యం చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించే టీచర్-పేరెంట్ సమావేశాలలో భాగంగా జిల్లాలో 1,280 పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించేందుకు రమేష్ డీఈవో సారథ్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

రూ.30.17 లక్షల నిధులు విడుదల

జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ సమావేశాల నిర్వహణకు, సహపంక్తి భోజనాలకు ప్రభుత్వం రూ.30.17 లక్షల నిధులు విడుదల చేసింది. పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను ఆయా ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆయా మండల విద్యాశాఖాధికారుల ద్వారా అందజేశారు. తాగునీరు, స్నాక్స్, మధ్యాహ్న భోజనం కోసం ఈ నిధులను వెచ్చించాలని హెచ్ఎంలను ఎంఈవోలు ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించనున్నారు.

మధురపూడి విమానాశ్రయం



ఆయ్.. ఇది.. గోదారోళ్ల ఎయిర్‌పోర్టు!

- రోజుకు 22 విమానాలు.. 1600 మంది ప్రయాణం
- అతి పెద్ద విమానమూ దిగే రన్‌వే ఇక్కడి ప్రత్యేకత
- రూ.347 కోట్లతో మరో టెర్మినల్ నిర్మాణం
- నేడు పౌర విమానయాన దినోత్సవం

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

రన్‌వేపై విమానం





'ఆయ్.. మా రాజమండ్రిలో ఇమానం ఎక్కి హైదరాబాద్ వచ్చామండి'.. మా ఎయిర్‌పోర్టు ఎంతో అందంగా ఉంటది తెలుసాండీ'. నిజమే.. రాజమహేంద్రవరం కీర్తి కిరీటంలోని కలికితురాళ్లలో మధురపూడి విమానాశ్రయం ఒకటి. దీనిని ముద్దుగా గోదారోళ్ల విమానాశ్రయం అని కూడా పిలుచుకుంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధిలో వాయు వేగంతో దూసుకుపోతోంది. అటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. ఇటు పాలకుల చొరవ.. ముఖ్యంగా ప్రయాణికుల ఆదరణతో ఎంత పెద్ద విమానమైనా దిగే దశకు చేరుకొంది. గత ఏడాది సీ-30, సీ-31 వంటి యుద్ధ విమానాలు కూడా ఇక్కడ దిగాయి. మరో 20 ఏళ్ల అవసరాలకు సరిపడా సాధనా సంపత్తినీ సమకూర్చుకుంటోంది. ఆ వైపున కోనసీమ నుంచి ఇటు మెట్ట, ఏజెన్సీని కలుపుకొని మొత్తం ఆరు జిల్లాల వారికి నిరంతరం సేవలందిస్తోంది. నేడు అంతర్జాతీయ పౌరయాన దినోత్సవం సందర్భంగా గోదారోళ్ల విమానాశ్రయం (మధురపూడి ఎయిర్‌పోర్టు) గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మరో టెర్మినల్ నిర్మాణం

ప్రస్తుతం ఒక టెర్మినల్ అందుబాటులో ఉంది. అయితే రానున్న 20 ఏళ్ల ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకొని 21 వేల చదరపు మీటర్లలో రూ.347 కోట్లతో మరో టెర్మినల్‌ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ఇది అందుబాటులోకి వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయి. దీని నిర్మాణం పూర్తయితే ఒకేసారి 2వేల మంది ప్రయాణికులను హ్యాండిల్ చేయగలిగిన సామర్థ్యం ఉంటుంది. ప్రయాణికులకు సదుపాయాలు, కార్గో, పార్కింగ్ వంటివి అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి.

● ఇంతింతై.. ఎయిర్‌బస్‌లు ఎగిరేంతై..

ఈ విమానాశ్రయాన్ని బ్రిటీషర్లు తమ అవసరాల కోసం సుమారు 300 ఎకరాల్లో నిర్మించారు. తర్వాత వాణిజ్య, విద్య, మెడికల్ తదితర రంగాల్లో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందడంతో అదే తీరులో విమానాశ్రయం అభివృద్ధి చెందింది. రెండో విడత 800 ఎకరాలకు, తర్వాత 1218 ఎకరాలకు విస్తరించారు. 1985 నుంచి 1994 వరకూ వాయుదూత్ విమానాలను నడిపారు. ఇప్పుడు ఇక్కడ 3,165 మీటర్ల రన్‌వే ఉండగా.. గంటకు 10 విమానాలు.. రోజుకు 50 విమానాలు వచ్చి వెళ్లినా ఆపరేట్ చేయగలిగిన సామర్థ్యం ఉంది. దేశంలో అతిపెద్ద విమానాలు సైతం రాకపోకలు సాగించే స్థాయికి చేరుకొంది. ప్రస్తుతం రోజుకు 22 మంది విమానాలు నడుస్తుండగా 1,600 మంది వరకూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు ఎయిర్‌పోర్ట్ తెరుస్తారు. 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకూ చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు సర్వీసులున్నాయి. చిన్న విమానాలు మాత్రమే నడుస్తున్నాయి. తొలిసారిగా ముంబైకి ఇటీవల ఎయిర్‌బస్‌ని ప్రారంభించారు. ఈనెల 12 నుంచి ఢిల్లీకి విమానం అందుబాటులోకి రానుంది. హ్యాంగర్స్ (విమానాల పార్కింగ్ ప్రదేశం)కి అవసరమైన స్థలం ఉంది.

● ఇవీ అందుబాటులోకి వస్తే...

మన ప్రాంతంలోని కాకినాడ నుంచి సముద్ర ఉత్పత్తులు, భీమవరం నుంచి రొయ్యలు, కోనసీమ నుంచి కొబ్బరి ఉత్పత్తులు, వస్త్రాల రవాణా ఎక్కువగా ఉంటోంది. రాజమండ్రిలోని వాణిజ్యంలో వస్త్ర దుకాణాలు మొదటి వరుసలో ఉంటాయి. ఈ నేపథ్యంలో కార్గో అవసరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ సేవలు అందిస్తున్నా.. చిన్న విమానాలు కావడంతో ఎక్కువగా ఉపయోగం లేకపోయింది. ఇప్పుడు ముంబైకి ఎయిర్‌బస్ ప్రారంభం కావడంతో.. మొత్తం కలిసి రోజుకు 5 టన్నుల వరకూ సరుకు రవాణా చేసే వెసులుబాటు కలిగింది. అదేవిధంగా ఈ ప్రాంతం నుంచి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రయాణాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం తిరుపతి, శిరిడీకి రైళ్లలో బెర్తులు దొరకడం అదృష్టంపై ఆధారపడి ఉంటోంది. ఆయోధ్యకు అసలు నేరుగా రైలు సదుపాయం లేదు. ఈ సీజన్‌లో శబరిమల (కోచి ఎయిర్‌పోర్ట్)కూ స్వాములు ఎక్కువగానే విమానాలను ఆశ్రయిస్తున్నారు. వీటిని కూడా విమానయాన సంస్థలు అందిపుచ్చుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇండిగో సంస్థ ఒకటే ఇక్కడ నుంచి విమానాలను ఆపరేట్ చేస్తోంది. విమానాశ్రయం అభివృద్ధి చేయడమే కాకుండా మరిన్ని విమానయాన సంస్థలు విమానాలు నడిపేలా చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. జనాదరణ బాగానే ఉన్నా ఆపరేటర్లు లేని పరిస్థితి నుంచి బయటపడాలి. అలాగే ముఖ్యంగా ఎయిర్ అంబులెన్స్‌ని అందుబాటులోకి తీసుకురావాలి. దేశీయంగా మరిన్ని నగరాలకు, అంతర్జాతీయంగా ఒకటి రెండు దేశాలకు విమాన సర్వీసులు తిరిగితే బాగుంటుంది.

140 మందితో 24 గంటలూ రక్షణ

ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం (ఏపీఎస్‌పీఎఫ్) చూస్తోంది. కమాండెంట్ కేఎస్ రావు పర్యవేక్షణలో ఓ డీఎస్పీ ఆధ్వర్యంలో 140 ఎస్‌పీఎఫ్ సిబ్బంది షిఫ్టుల వారీగా విధుల్లో ఉంటారు. బోర్డింగ్ పాస్‌ల చెకింగ్, ప్రయాణికుల రాకపోకల్లో తనిఖీ, లగేజీ స్కానింగ్ వంటివన్నీ క్షుణ్ణంగా నిర్వహిస్తున్నారు. సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విధివిధానాలను అనుసరించి పని చేస్తున్నారు. మహిళల చెకింగ్ కోసం మహిళా పోలీసులనూ అందుబాటులో ఉంచుతున్నారు.

మరింత విస్తరణ దిశగా..

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 50వ వార్షికోత్సవం సందర్భంగా 1994లో తొలిసారిగా అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం నిర్వహించారు. విమానయాన రంగం వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు, సేవలు, అభివృద్ధి వంటి వాటిపై ఆ రోజున అవగాహన కల్పిస్తారు. 2050 నాటికి జనాభాలో మూడింట రెండు వంతుల మంది నగరాల్లోనే నివసిస్తారని, విమాన ప్రయాణాలు విస్తరిస్తాయని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది.

కొత్త సర్వీసులకు ప్రయత్నిస్తున్నాం..

వచ్చే వేసవికాలం నాటికి శిరిడీ, తిరుపతి, కోల్‌కతా, గోవా, అయోధ్య తదితర నగరాలకు విమానలు నడిపే ప్రయత్నాలు చేస్తున్నాం. మిగతా ఎయిర్‌లైన్స్ సర్వీసుల ఆపరేటర్లు కూడా ముందుకు వస్తే బాగుంటుంది. విమానాశ్రయంలో సేఫ్టీ, సెక్యూరిటీ నూరు శాతం ఉంది. సదుపాయాల పరంగా అన్నీ ఉన్నాయి. అందువల్ల మరిన్ని విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చే కృషి జరగుతోంది.

- ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్





అఖండ శంఖారావ యుగళం దంపతులకు జాతీయ పురస్కారం

నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో అనేక రికార్డులను కైవసం చేసుకున్న డాక్టర్ కొండ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులను కామధేను జాతీయ పురస్కారాలు -2024కి ఎంపిక చేసినట్టు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించింది. దీనిని ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే నరసింహారావు రాజమహేంద్రవరం ప్రాంతీయ కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 38 ఏళ్లుగా వివిధ కార్యక్రమాల్లో శంఖాన్ని పూరించి అనేక పురస్కారాలను అందుకున్నారు.

పి.గన్నవరం/రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో రికార్డులను కైవసం చేసుకున్న పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు తాజాగా విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామధేను అవార్డ్స్-2024 జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత సంస్థ ఒక ప్రకటనలో తెలిపినట్టు నరసింహారావు తెలిపారు. ఈ అవార్డును ఈనెల 8న హైదరాబాదులో జరగబోయే అవార్డుల ప్రదానోత్సవంలో నరసింహారావు దంపతులకు కామధేను జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు రాంబాబు నుంచి ఆహ్వానం అందింది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీఎఫ్ (ఏపీ ప్రత్యేక రక్షణ దళం) కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండా నరసింహారావు దంపతులు ఆఖండ శంఖారావ యుగళంగా పేరుగాంచారు. అంతేకాకుండా గత 38 ఏళ్లుగా వేలాది ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అఖండ శంఖారావాన్ని పూరించి పలు సంస్థలు నుంచి సువర్ణ ఘంటా కంకణాలు, సన్మానాల తోపాటు పలు అవార్డులు స్వీకరించారు. అలాగే దేశంలోని పలు ప్రాంతాల్లో శంఖారావం పూరించి పలువురు ప్రశంసలు పొందారు. అవార్డుకు ఎంపికైన కమాండెంట్ దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు.

బియ్యం డంప్‌పై అధికారుల దాడులు



బియ్యంను పరిశీలిస్తున్న అధికారులు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని మండలం కొలిమేరు సమీపంలో అక్రమంగా బియ్యం నిల్వలు దాచి పెట్టారన్న సమాచారంతో తుని రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. కొలిమేరు గ్రామ శివారు మూతపడిన కోళ్ళఫారంలో సుమారు 500బస్తాలు బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ బియ్యం అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి రైస్‌మిల్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా పొలాల మధ్యన ఉన్న కోళ్ళఫారంకు తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులను ఆరా తీయగా సంబంధిత నిల్వల్లో రేషన్ బియ్యంగా అనుమానం ఉందని బియ్యం శాంపిల్స్‌సేకరించి ల్యాబ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. తుది నివేదిక ఆధారంగా కోళ్ళఫారం నిర్వాహకులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఎస్‌వో బి.రాజు, ఆర్ఐ తాతారెడ్డి, రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులతోపాటుగా స్థానిక వీఆర్వో ఉన్నారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నేడు బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి



బిక్కవోలు షష్ఠి పందిరి అలంకరణ



స్వాగతం పలుకుతున్న వెంకటేశ్వరస్వామి సెట్టింగ్

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొంది శనివారం నిర్వహించే బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవానికి అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం తెల్లవారుజామున 1-20 గంటకు స్వామివారి తీర్థపుబిందె సేవతో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి నుం చి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించనున్నట్టు తెలిపారు. భక్తుల దర్శనాలకు భారీ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ఆవరణ అంతా చలువ పందిరి వేసి విద్యుత్ దీపాలతో అలంకరించామని చెప్పారు. శనివారం ఉదయం స్వామివారిని మయూర వాహనంపై గ్రామోత్సవం, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఆలయ ఆవరణలో వివిధ బ్యాండు కచేరీలు, 4.30 గంటల నుంచి 5.30 వరకూ పగలు బాణాసంచా ఉంటుందని రాత్రి 11గంటల నుంచి తెల్లవారే వరకూ స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన గోలింగేశ్వరా ఫైర్ వర్క్స్, కనకదుర్గా హస్సేనియా ఫైర్‌వర్క్స్ వారిచే బాణాసంచా పోటీలు జరుపుతామన్నారు. రాత్రి 8గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరుపుతామన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న మహాన్నదానంతో షష్ఠి ఉత్సవాలను ముగిస్తామన్నారు. 7 నుంచి 11 వరకూ షష్ఠి కళావేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

270 మందితో పోలీసు బందోబస్తు

షష్ఠి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో 270 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. వీరిలో ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలతోపాటు తొమ్మిది మంది సీఐలు, 19 మంది ఎస్ఐలు, 70 మంది మహిళా పోలీసులు, హోమ్‌గార్డులు, యాభై మంది ఏఎస్ఐ, హెచ్‌సీలు, 67 మంది కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు విధులు నిర్వహిస్తారన్నారు. షష్ఠి సందర్భంగా ట్రాఫిక్ దృష్ట్యా బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో ఫోర్ వీలర్లకు డిసెంబరు 7, 8 తేదీల్లో అనుమతులు నిలిపి వేశామని, వాహన యజమానులు సహకరించాలని వారు కోరారు.

సంతాన సుబ్రహ్మణ్యుడికి ఐదు రోజుల ఉత్సవాలు





రాజానగరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, విద్యుద్దీపాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

రాజానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో సంతాన సౌభాగ్య ప్రదాతగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు శనివారం నుంచి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవకమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరం వాస్తవ్యుడు తోట సత్యనారాయణ మూర్తి దంపతులు ప్రతిష్ఠించిన ఈ ఆలయం 98 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామి కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. సంతానం లేమితో బాధపడతున్న మహిళలు షష్ఠిరోజు నాగుల చీర ధరించి ఉపవాసదీక్షతో స్వామివారి సన్నిధిలో శయనిస్తారు. సాయంత్రం జరిగే స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తలంబ్రాలు బియ్యం చీరకొంగుతో ఒడిసి పట్టుకుని అనంతరం ఇంటికి వచ్చి క్షీరాన్నం వండుకుని భుజిస్తే సంతానం కల్గుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.ఉత్సవ కమిటీ ప్రత్యేక బారి కేడ్లు ఏర్పాటు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పెండ్లి కొడుకాయనే..

● నేటి రాత్రికి దివ్యకల్యాణం



పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీదేవసేనలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4గంటలకు ప్రత్యేక వేదికపై నవవధూవరులు కానున్న స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం ఉల్లాకుల గౌరీపూజను నిర్వహించిన అనంతరం ముత్తైదువులు పసుపుదంచారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు నుదుట తిలకం బుగ్గనచుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరించారు. రాత్రి 7గంటలకు మయూర, శేషతల్ప వాహనాలపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని శనివారం రాత్రి 8గంటలకు దివ్యకల్యాణం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్స్, ప్రసాదం వితరణ కేంద్రాలు, కమిటీ ఏర్పాటుచేశారు. ఆదివారం రాత్రి జరిగే శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి.

పసుపు దంచుతున్న ముత్తైదువులు



సత్యదేవుడి దత్తత ఆలయంగా

బలిఘట్టం సత్యదేవుడి ఆలయం

● పత్రాలను దేవస్థానం అధికారులకు అందజేసిన శాసనసభ స్పీకర్

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దత్తత ఆలయంగా అనకాపల్లిజిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయం చేరింది. దీనిని లాంచనంగా శుక్రవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రత్నగిరికి విచ్చేసి లాంచనప్రాయంగా సంబంధిత పత్రాలను దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. గతంలో ఈ ఆలయాన్ని అన్నవరం దేవస్థానం నిధులు సుమారు రూ.45లక్షలతో నిర్మించారు. వీటి నిర్వహణను అప్పట్లో ఆ గ్రామపెద్దలు చూసుకునే వారు. అనంతరం నిర్వహణా భారం, ప్రత్యేకశ్రద్ధను ఎవరూ కనబరచకపోవడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదన మేరకు దేవదాయశాఖ అంగీకారం తెలిపింది. ఈ ఆలయానికి సుమారు 36ఎకరాల భూమి ఉండ గా ఆ పత్రాలను దేవస్థానం అధికారులు తీసుకున్నా రు. దీని నిర్వహణకు ఏటా రూ.5లక్షల వ్యయం అవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే అన్న వరం దేవస్థానం పరిధిలో దత్తత ఆలయాల సంఖ్య తొమ్మిదికి చేరింది. అంతకు ముందు ఆలయానికి విచ్చేసిన అయ్యన్నపాత్రుడు కుటుంబసభ్యులకు దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



బలిఘట్టం ఆలయ దత్తతకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

'లోవ'లో హుండీల లెక్కింపు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయం ఉన్నతాధికారులు శుక్రవారం హుండీలు లెక్కించారు. అమ్మవారిదేవస్థానానికి సంబంధించిన హుండీలు తెరిచి లెక్కించగా 76రోజులకు రూ.39,39,250లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.విశ్వనాధ్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలతోపాటుగా ప్రత్యేకాధికారిగా తంటికొండ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారిణి ఎం.సూర్యామణి ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

దశాబ్దాల కల సాకారం

రామచంద్రపురంలో
జిల్లా అదనపు సెషన్స్ కోర్టు సిద్ధం
ఈనెల 10న ప్రారంభించనున్న
హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ప్రజల దశాబ్దాల కల సాకారం అవుతుంది. ప్రజలు ఎదురుచూస్తున్న జిల్లా అదనపు సెషన్స్ కోర్టు రామచంద్రపురంలో ప్రారంభానికి సిద్ధ అయ్యింది. ఈ నెల 10న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీంతో రామచంద్రపురం పరిసర మండలాల ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులకు జిల్లా కోర్టు బెంచి ద్వారా న్యాయసేవలు చేరువ కానున్నాయి.



రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు భవనం

రామచంద్రపురం (ద్రాక్షారామ) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 1994 నుంచి జిల్లా సెషన్స్ కోర్టు బెంచి ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభించారు. పలు బార్ అసోసియేషన్ కార్యవర్గాలు, సీనియర్ న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యవర్గం, ఇతర సీనియర్ న్యాయవాదుల కృషి ఫలించింది. దీంతో 15 మార్చి 2024న రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఎన్నికల కోడ్ రావడంతో కొంత ఆలస్యం జరిగింది. తిరిగి కోర్టు ఏర్పాటు వేగవంతంగా జరిగింది. 1931 నుంచి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నిర్వహిస్తున్న భవనంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టును బార్ అసోసియేషన్ భవనంలోకి మార్చి నిర్వహిస్తున్నారు.

వర్చువల్‌గా ప్రారంభం...

రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన జిల్లా అదనపు సెషన్స్ కోర్టును రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈనెల 10న ఉదయం 10.15 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి నైనాల జయసూర్య, న్యాయమూర్తులు ఆర్.రఘునందనరావు, బీవీఎల్ఎన్ చక్రవర్తి, టి.మల్లి ఖార్జున, సుమతిజగడం, న్యాపతి విజయ్ సమక్షంలో ప్రారంభోత్సవం జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గంధం సునీత పాల్గొంటారన్నారు.

తీరనున్న ప్రజల కష్టాలు...

రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటుతో ప్రజలు, కక్షిదారుల కష్టాలు తీరనున్నాయి. జిల్లా కోర్టుసేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి. ఇప్పటివరకు రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, మెజిస్ట్రేట్ కోర్టు తీర్పులు, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పులపై అప్పీలుకు జిల్లా కోర్టు పరిధిలోకి వచ్చే సివిల్, క్రిమినల్ కేసులకు రాజమహేంద్రవరం జిల్లా సెషన్స్ కోర్టుకు వెళ్లవలసి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటుతో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, రాయవరం, మండపేట, అనపర్తి, బిక్కవోలు మండలాల ప్రజలకు దూరభారం తప్పనుంది.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ » కోట సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు



కోటసత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఐజీ, ఎస్పీ



నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జి.అశోక్‌కుమార్ తెలిపారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మతల్లిని శుక్రవారం ఆయన, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి కేసుల పురో గతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక గస్తీని పెంచడంతో పాటు యువతకు కళాశాలల్లో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా సంఘటన జరిగితే పోలీసులు తక్షణం స్పందించి పరిష్కారం దిశగా పని చేసేలా అధికార్లకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లావ్యాప్తంగా కేసులకు సంబంధించి వాటి పురోగతిపై ప్రతివారం సమీక్ష చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీని ఆనుకుని ఉండడంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టామని తెలిపారు. ఒరిస్సా, వైజాగ్, ఏఎస్ఆర్ జిల్లాల పోలీస్ అధికారులు సమన్వయంతో గంజాయి రవాణాను నివారించేందుకు ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. వారి వెంట అడిషనల్ ఎస్పీ ఎన్‌వీ. మురళీకృష్ణ, కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, సీఐ తిలక్, ఎస్ఐలు శోభన్‌కుమార్, సతీష్ ఉన్నారు.

టైరు పేలి అదుపు తప్పి... లారీని ఢీకొన్న వ్యాన్

వ్యాన్ డ్రైవర్ మృతి



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన వ్యాన్

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపర్తి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరానికి వ్యాన్‌లో దానిమ్మ కాయల లోడుతో వస్తున్నాడు. దూబచర్ల వద్ద వ్యాన్ ముందు టైరు పేలి అదుపు తప్పి డివైడర్ అవతల వైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ నరసింహులు అక్కడికక్కడ మృతిచెందగా వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. కాగా నరసింహులుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి విగత జీవిగా పడి ఉండడంతో భార్య, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్ఐ సోమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.



నరసింహులు (ఫైల్ ఫొటో)

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి
ప్లాస్టిక్ సర్జరీపై రెండోరోజు రాష్ట్రస్థాయి సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లావణ్యకుమారి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నూతన మెళకువలను అందిపుచ్చుకుని నిష్ణాతులైన వైద్యనిపుణులుగా తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్యచికిత్సను అందించాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ ఈస్తటిక్ సర్జన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ(ఏపీఆర్ఏఎస్‌సీఓన్)-2024 ఆధ్వర్యంలో జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు రెండో రోజైన శుక్రవారం వివేకానంద పార్క్ ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో డాక్టర్ లావణ్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏపీఆర్ఏఎస్‌సీఓన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ బి.రత్నభూషణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో ఎన్నో నూతన ఆవిష్కరణలకు తెరలేపి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన నైపుణ్యతను, నూతన మెళకువలను క్షుణ్ణంగా తెలుసుకునేలా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సర్జరీలో కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక విధానాలను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. శుక్రవారం జరిగిన సైంటిఫిక్ సెషన్‌కు దేశ నలుమూలల నుంచి వచ్చిన నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు వైద్యులు, వైద్యవిద్యార్థులకు నాణ్యమైన వైద్యచికిత్స విధానంపై వివరించారు. సదస్సు అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఏపీఆర్ఏఎస్‌సీఓన్ ప్యాట్రన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్, కార్యదర్శి డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సల స్పెషల్ బస్సు...2 రోజులు ఇక్కడే



శస్త్రచికిత్స పరికరాలను పరిశీలిస్తున్న వైద్యనిపుణులు

ప్రాథమిక శస్త్ర చికిత్స అంశాలపై వైద్యులు, వైద్యవిద్యార్థులకు శిక్షణను ఇచ్చేందుకు అత్యాధునిక వసతులతో కూడిన ప్రత్యేక బస్సు శుక్రవారం కాకినాడ రంగరాయ కళాశాల(ఆర్ఎంసీ)కు వచ్చింది. జీజీహెచ్, ఆర్ఎంసీల్లో వైద్యవిద్యను బోధిస్తున్న వైద్య నిపుణుల పర్యవేక్షణలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు, హౌస్‌సర్జన్‌లకు ఈ బస్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఆధునిక బస్సులో రకరకాల కుట్లకు సంబంధించిన శిక్షణ, లాపరోస్కోపిక్ ఆపరేషన్లకు సంబంధించిన శిక్షణ, ముఖ్యంగా పేగుల ఆపరేషన్‌లో ఉపయోగించే స్టాప్లర్‌లు అనే ప్రత్యేక పరికరాలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లో ఈ బస్సు ఆర్ఎంసీ ప్రాంగణంలో ఉండనున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. సాధారణ, లాపరోస్కోపిక్, గైనకాలజీ, యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీల వైద్యులు, వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

గాడాలలో విజిలెన్స్ తనిఖీలు

రూ.5,28,271 విలువైన ఎరువులు సీజ్



గాడాలలో గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న స్నేహిత

కోరుకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని లక్ష్మీగణేష్ ట్రేడర్స్ ఫెర్టిలైజర్స్ షాపును శుక్రవారం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ, లీగల మెట్రాలజీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 ఎకరాల ఎరువుల్లో వ్యత్యాసం ఉండడం వల్ల షాపు యజమానిపై మండల వ్యవసాయాధికారి 6ఏ కింద కేసు నమోదు చేశారు. సుమారు రూ.4,85,271 విలువైన 21.900మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. 10కిలోల వీనస్ సాయిల్, ఎఫ్7, సుప్రీం బ్యాగ్‌పై యూనిట్ విక్రయ లేకపోవడంపై లీగల్ మెట్రాలజీ అధికారులు రూ.43వేలు విలువై 40 బ్యాగులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ షాపులో మొత్తం రూ.5,28,271 విలువ గల ఎరువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా స్నేహిత మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని 3 జిల్లాలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందు దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. గరిష్ఠ అమ్మకం ధర కంటే ఎక్కువ అమ్మినా, అక్రమ నిల్వలు కలిగి ఉన్నా, నకిలీ విత్తనాలు అమ్మినా, స్టాక్ రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్‌టీ తాతారావు, తహశీల్దార్ విజయ్‌కుమార్, లోవరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్ యాత్ర

కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారంపూడి అక్రమాలు బయటకు
సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజం

కాకినాడ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్ యాత్ర చేపడుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పథకం ప్రకారమే బియ్యం మాఫియా రెచ్చిపోయిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎన్నో అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారన్నారు. అవి ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. ద్వారంపూడి చేసిన అక్రమాలను నాడు ఆరోపించిన తాము ఇప్పుడు ఆధారాలతో సహా సంబంధిత అధికారులకు అందించామన్నారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించడంలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి సహకారంతో చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యేగాను, భాస్కరరెడ్డి పౌరసరఫరాలశాఖ చైర్మన్‌గాను, వీరభద్రారెడ్డి రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగాను రేషన్‌బియ్యం మాఫియా నడిపారన్నారు. మాజీ సీఎం జగన్ వైసీపీకి చెందిన దొంగలకు భరోసా కల్పించేందుకే యాత్ర చేపడుతున్నారని, కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారం పూడి అక్రమాలు బయటకు వస్తాయన్నారు. నాడు బియ్యం వ్యాపారంలో తాము కింగులం అన్న ద్వారంపూడి నేడు చాలా చిన్నవాళ్లమని చెప్పి బేలతనాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. అక్రమాలకు ఉపయోగించుకున్న కాకినాడ పోర్టు పేరు ప్రఖ్యాతలను తిరిగి నిలబెడతామని కొండబాబు చెప్పారు.

జేఎన్టీయూకేలో... డ్రోన్ డవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని సెనెట్ హాల్లో డ్రోన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్‌టెక్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏపీని భారతదేశానికి డ్రోన్ రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సీఈ వి.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వీసీ మురళీకృష్ణ

కోతులు కూల్చిన ఇల్లు

భూకంపధాటికి బీటలువారిన
రావి చెట్టు కొమ్మలు



కోతుల కారణంగా కూలిపోయిన ఇల్లు

కూనవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరంలో బల్లా ఉమాదుర్గకు చెందిన ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున వానరుల దండు కారణంగా కుప్పకూలింది. 2రోజుల క్రితం కూనవరంలో స్వల్పంగా భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ భూకంపందాటికి కూనవరం పంచాయతీ దగ్గరలో ఉన్న ఓ భారీ రావిచెట్టు కొమ్మ బీటలు వారింది. సగం వరకు బీటలు వారడంతో అప్పటికే ఆ రావి చెట్టు కొమ్మ కిందపడిపోయే స్థాయిలో ఉంది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా వానరుల దండు ఆ రావిచెట్టు కొమ్మపై ఊగిసలాడడంతో వాటి బరువుకు ఆ కొమ్మ కిందపడిపోయింది. కొమ్మ కింద ఉమాదేవి ఇల్లు ఉండడంతో రేకులు, గోడలు కుప్పకూలిపోయాయి. ఉమాదేవి కు టుంబం ఆసుపత్రికివెళ్లడంతో ప్రమాదం తప్పింది.

కృష్ణా జిల్లాకు... క్యూ కట్టిన లారీలు

వెయ్యిమెట్రిక్ టన్నుల ధాన్యం లోడింగ్
చేసుకుని కాకినాడ జిల్లాకు నేడు రాక

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నుంచి 45 లారీలు శుక్రవారం కృష్ణా జిల్లాకు బయలుదేరి వెళ్లాయి. అక్కడి నుంచి వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం లోడింగ్ చేసుకుని శనివారం కాకినాడకు చేరుకోనున్నాయి. కృష్ణా జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం సేకరణకు మంచి స్పందన లభించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చి చేరుతుంది. దీంతో అక్కడ నిల్వ చేయడం కష్ట సాధ్యంగా మారింది. దీంతో కృష్ణాజిల్లాలో సేకరించిన ధాన్యాన్ని కాకినాడ జిల్లాకు తరలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ధాన్యం తరలింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కాకినాడ అధికారులకు ఆదేశించారు. దీంతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవుల నాయక్, ఆర్డీవో మల్లిబాబుల ఆధ్వర్యంలో ధాన్యం తీసుకొచ్చేందుకు జిల్లాలో మిల్లర్లకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు మిల్లర్లు 45 లారీలను కృష్ణాజిల్లాకు పంపించారు. ఒక్కొక లారీలో 20మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం లోడింగ్ చేసుకుని శనివారం కాకినాడకు రానున్నాయి. ఈ ధాన్యం కాకినాడ జిల్లాలో వివిధ సీఎంఆర్ మిల్లుల్లో మిల్లింగ్ చేసుకుని బియ్యంను జిల్లాలో పౌరసరఫరాల సంస్థ గొడౌన్లలో నిల్వ చేస్తారు. మరో 2 రోజుల పాటు జిల్లానుంచి లారీలు కృష్ణా జిల్లాకు పయనం కానున్నారు.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడిపై బీరు బాటిల్‌తో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజుపై గుర్తు తెలియని దుండగుడు బీరు బాటిల్‌తో దాడిచేసి పరారైన సంఘటన గురువారం రాత్రి రాయవరం మండలం చెల్లూరులో జరిగింది. టీడీపీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం... పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు వైసీపీ సానుభూతిపరులు పుష్ప-2 సినీ నటులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోతో కూడిన రెండు ఫ్లెక్సీలను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఎలా ఏర్పాటు చేస్తారని టీడీపీ నాయకుడు బవిరిశెట్టి అప్పారావు గ్రామ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల సహకారంతో ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు, పోలీసు సిబ్బందితో వెళ్లారు. ఒక ఫ్లెక్సీ తొలగించడంతో రెండో ఫ్లెక్సీని తొలగించకపోవడంతో మరోసారి అధికారులు ఫ్లెక్సీ తొలగించేందుకు వెళ్లారు. పంచాయతీ గేటుకు సమీపంలో కూటమి నేతలతో మాట్లాడి బయటకు వెళ్తున్న గ్రామశాఖ అధ్యక్షుడి వీర్రాజుపై వెనుక నుంచి బీరు బాటిల్‌తో దాడి చేసి దుండగుడు తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే సమీపంలో కూటమి నేతలు వీర్రాజు వద్దకు వచ్చేసరికి దూరంగా పక్క వీధిలో ఉన్న మరో వ్యక్తి బైక్‌పై దుండగుడు పరారయ్యాడు. రాయవరం ఎస్ఐ బుజ్జిబాబుకు విషయం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని దాడి సంఘటనపై ఆరా తీశారు. వీర్రాజును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి కూటమి నేతలు తరలించారు. ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజును రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

'అస్సాగో ఇథనాల్ పరిశ్రమను వెంటనే సీజ్ చేయాలి'



రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం సభ్యులు

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఏర్పాటుచేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేసి, వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రంపయర్రంపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నా కుల వీరాంజనేయులు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల వెలువడయ్యే విష వాయువుల వల్ల సమీపంలో ఉన్న గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నారని.. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని విమర్శించారు. పరిశ్రమకు సీజ్ చేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్, నాయకులున్నారు.

పరిశ్రమకు వ్యతిరేకంగా పోస్టర్లు

గుమ్మళ్ళదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా శుక్రవారం గోడలపై పోస్టర్లు వెలిశాయి. పోలీసులు పంచాయితీ అధికారుల సహకారంతో వాటిని తొలగించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు.

జీజీహెచ్ మేనేజర్ సస్పెండ్‌కు సిఫార్సు చేసిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావును సస్పెండ్ చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ఒక నివేదికను వైద్యఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్‌కు పంపించారు. 2020-21లో కొవిడ్ సమయంలో నర్సుల పోస్టుల నియామకాల్లో మెరిట్‌ను పాటించకుండా పోస్టులు నింపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆస్పత్రిలో 278 నర్సుల పోస్టుల భర్తీలో పలువురు అనర్హులకు పోస్టింగులు ఇచ్చిన నేపథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన రాజీవ్‌వర్మ ఇచ్చిన ఫిర్యాదుతో అక్టోబరు 24న విచారణ కమిటీని నియమించారు. ఈ వ్యవహారంపై విచారణ పూర్తిచేసిన కమిటీ తమ నివేదికను గతనెల 7న కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. అవకతవకలు నిర్ధారణ కావడంతో గతనెల 26న జీజీహెచ్ మేనేజర్‌కు మెమో జారీ చేశారు. అక్రమాలు నిర్ధారణ అయిన నేపథ్యంలో చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. మేనేజర్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో కలెక్టర్ శుక్రవారం అతడ్ని సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ముమ్మిడివరం/పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిండి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. పాఠశాలలో 3,4,5 తరగతులకు సంబంధించి ఆరుగురు విద్యార్థులపై అతడి లైంగిక వేధింపులపై ఈనెల 4వ తేదీన ఎంఈవో-1,2 కె.హెలీనా, సీహెచ్ వీరభద్రనందం విచారణ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు నిర్ధారించుకుని ఎంఈవో కె.హెలీనా నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం ఆ ఉపాధ్యాయుడిని 4వ తేదీ నుంచి విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పేర్కొన్నారు. అలాగే ఆ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైందన్నారు.

వీరేశ్వరుని హుండీ ఆదాయం రూ.31 లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ వీరేశ్వర స్వామి హుండీల ఆదాయం 280రోజులకు రూ.31,01,405 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజోలు కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరాజు పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీ ద్వారా రూ.16,78,974, నిత్యకల్యాణం హుండీ ద్వారా రూ.12,25,944, వీరేశ్వరఅన్నదాన ట్రస్టు ద్వారా రూ.1,96,487 సమకూరినట్టు తెలిపారు. 48గ్రాముల బంగారం, 290గ్రాముల వెండి, 2 విదేశీ డాలర్లు వచ్చినట్టు తెలిపారు. ఆదాయాన్ని మురమళ్ళ బ్యాంక్ ఆఫ్ బరోడాలో డిపాజిట్ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కటారి నాని, దాట్ల ఇంద్రరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చులో పడి 6 ఆవులు, 2 ఎద్దులు మృతి

అడ్డతీగల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం అనిగేరు సమీపంలో అటవీ ప్రాంతంలో దుండగులు అడవి జంతువుల వేట కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో పడి ఒకే రైతుకు చెందిన 6 ఆవులు, 2 ఎద్దులు మృతి చెందాయి. అనిగేరు గ్రామానికి చెందిన ముర్ల అబ్బాయిరెడ్డికి చెందిన మొత్తం పశువులు ఈ ఘటనలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది. దీనిపై బాధితుడు శుక్రవారం అడ్డతీగల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మృతిచెందిన మూగ జీవాలు

నేడు షష్ఠి మహోత్సవం

కాకినాడ రూరల్,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

13న యువ ఉత్సవ్ : కలెక్టర్ షాన్‌మోహన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యువత ఈనెల 13న నిర్వహించే యువ ఉత్సవాల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ యువ ఉత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా యువజన అధికారి కిషోర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ యువ ఉత్సవ్ పేరుతో యువతకు వివిధ పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 13న యానాం రోడ్డు పటవల దగ్గర ఉన్న ఫైడా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. యువ ఉత్సవ్‌లో పేర్లు నమోదు కోసం, వివరాలకు 90003 40938 నెంబరులో సంప్రదించాలని కోరారు.

'విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని ఉపసంహరించుకోవాలి'


మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి కుంచే చిన్నా

పిఠాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిన అదనపు భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శుక్రవారం రాత్రి అన్ని ప్రజాసంఘాల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెనక్కి తీసుకోవాలని కోరారు. రీచార్జి చేస్తేనే కరెంటు వస్తుందని చెప్పడం సరికాదని విమర్శించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు కుంచే చిన్నా, వీరబాబు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కోనేటి రాజు, వివిధ సంఘాల ప్రతినిధులు సాకా రామకృష్ణ, డి.సత్యనారాయణ, జీఎస్ భాస్కర్, సూర్యచక్రం, మణి, గోపాలకృష్ణ, శ్రీను, సత్తిబాబు, అప్పన్న పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు


తాటిపర్తిలో పోలీసు బందోబస్తుపై సూచనలు ఇస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో జరిగే షష్ఠి బ్రహ్మోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాటిపర్తిలో ఉత్సవాలకు ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 70మంది సిబ్బంది.. మల్లవరం ఉత్సవాలకు ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, 30మంది సిబ్బందిని నియమించారు. బందోబస్తు విధులకు నియమితులైన పోలీసు అధికారులు, సిబ్బందితో శుక్రవారం రాత్రి కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు సమావేశం నిర్వహించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, క్యూలైన్లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రూ.550కోట్ల టీడీఆర్ బాండ్లు కొట్టేసిన ద్వారంపూడి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు


సమావేశంలో లేఖలను చూపుతున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎటువంటి మార్కెట్ విలువ లేని స్థలాలను అంటకట్టి రూ.550కోట్ల టీడీఆర్ బాండ్లను అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కొట్టేశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దుయ్యబట్టారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నర ఎకరాలు సబ్‌స్టేషన్ కోసం, మరో నాలుగున్నర ఎకరాలు చెత్త రీసైక్లింగ్ యూనిట్ కోసం తీసుకోవాలని దుమ్ములపేటలోని స్థలాలను సూచిస్తూ ద్వారంపూడి ప్రభుత్వానికి లేఖలు రాశారని చూపారు. ఆ తర్వాత నెల రోజుల వ్యవధిలోనే ఆ స్థలాలకు హడావుడిగా రూ.550కోట్ల టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారన్నారు. రేషన్ మాఫియా సూత్రధారి ద్వారంపూడి అని, కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని కోట్ల రూపాయల రేషన్ బియ్యం ఎగుమతి చేశారన్నారు. దాచుకున్న సొమ్ముకు దిక్కుమొక్కులేక శ్రీ జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బ్యాంకు డిపాజిట్‌దారులు అల్లాడుతుంటే ఆ సొసైటీకి చెందిన భవనాన్ని కొత్తపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో తన బినామీ పేర ద్వారంపూడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఐశ్వర్య గ్రాండ్ హోటల్ యాజమానికి అప్పు ఇచ్చిన వారు ద్వారంపూడిని ఆశ్రయిస్తే వారికి న్యాయం చేయాల్సింది పోయి ఆ హోటల్‌ను తమ వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని యజమానితో ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ చేయించి అప్పులిచ్చిన వారిని రోడ్డున పడేశారన్నారు. ద్వారంపూడి బాధితులు ఇప్పుడిప్పుడే ఫిర్యాదు చేయడానికి బయటకు వస్తున్నారని, త్వరలోనే ఆయన అరాచకాల చిట్టా బయట పెడతామన్నారు. కాకినాడ ప్రజలకు 30వేలు ఇళ్లు ఇచ్చామని డబ్బా కొట్టుకున్న ద్వారంపూడి కనీసం 300 ఇళ్లు కూడా పూర్తి చేయంచలేకపోయారన్నారు. ద్వారంపూడి అక్రమాలు ఆధారాలతో సహా బయటపెట్టామని, ఆయనపై చర్యలు తప్పవని కొండబాబు తెలిపారు. సమావేశంలో కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిసూడి వీరు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, బచ్చుశేఖర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల విజయవంతానికి కృషి

కాకినాడ ఆర్డీవో మల్లిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు భూ వివాదాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు కోరారు. శుక్రవారం సర్పవరం జంక్షన్‌లో మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో అధికారులు, రైతులు, ప్రజలు పూర్తి భాగస్వాములుగా చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెలవేర్చేలా కృషి చేయాలన్నారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో వచ్చిన ఫిర్యాదులు, వినతులపై ప్రస్తుత రెవెన్యూ సదస్సుల్లో చర్యలు తీసుకోవాలని, ఇందు కోసం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలోకెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్ గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేయాలని, 22ఏ నిషేధిత జాబితాలు అందుబాటులో ఉంచాలన్నారు. అస్సైండ్ ల్యాండు, ఇంటి స్థలాల జాబితాలు కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. భూకొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలలో మార్పులు, వారసత్వ పేర్లు నమోదు తదితర రెవెన్యూ అంశాలు, ఫిర్యాలు స్వీకరించాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహశీల్దార్లు ఆర్.కల్యాణ చక్రవర్తి, రీసర్వే డీటీ కే.సురేష్, ఆర్ఐ భవాని ఉన్నారు.

కోటి పసుపు కొమ్ముల పూజ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ పాదకా పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గల ప్రాంగణంలో శ్రీరామ సేవా సమితి, వికాస తరంగిణి, శ్రీవారాహీ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీపీఠం నిర్వాహకులు పరిపూర్ణానంద స్వామి నేతృత్వంలో వారాహి అమ్మవారికి కోటి పసుపు కొమ్ముల పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులకు వెండి పసుపు కొమ్ము ప్రసాదంగా పంపిణీ చేశారు.

'సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి'

కరప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ సైబర్ మోసాల పట్ల అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా ఉండాలని కరప ఎస్ఐ తోట సునీత, ఏఎస్ఐ వి.సూరిబాబులు సూచించారు. శుక్రవారం వారు సిబ్బందితో కలిసి గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత అవగాహన కల్పించారు. ఆయా కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన పోస్టర్లను అతికించి ప్రజలను చైతన్యపరిచారు. విదేశీ కోడ్‌లతో వచ్చే కాల్స్‌ను ఎత్తకపోవడమే ఉత్తమమని సూచించారు. ప్రతీఒక్కరూ తమ చుట్టుపక్కలవారికి సైబర్ మోసాలపై తెలపాలన్నారు. ఏమోసాలకు గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి కంప్లైంట్ రిజిష్టర్ చేయించుకోవాలని వివరించారు.


కరప ఎంపీడీవో ఆఫీస్‌లో సైబర్ క్రైమ్ పోస్టర్లను అతికించిన ఏఎస్ఐ సూరిబాబు

తాటిపర్తిలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే షష్ఠి బ్రహోత్సవాలకు ముందుగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు పెండ్లికుమారుడు, కుమార్తె అలంకారం చేశారు. అనంతరం ఉత్సవాలకు అంకురార్పణ, మయూర పతాక ఆరోహణ చేశారు. కాగా షష్ఠి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉచిత భోజన వసతి, ప్రసాద వితరణలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి, అర్చకులు కె.చైతన్య పూజాది కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు భగవద్గీత శ్లోక పఠన పోటీలు

పిఠాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాగణపతి సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. భగవద్గీతలోని 12 అధ్యాయంపై ఈ పోటీలు ఉంటాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సేవాసమితి సభ్యులను 9246864929లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులోని పేకాట శిబిరంపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.42,150లను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పాలతో అర్చన

పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కరం విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

సర్పవరంజంక్షన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఉత్పాదకతనిచ్చే వ్యాపారాలు ప్రారంభించిన మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు బ్యాంకర్ల సేవలు సద్వినియోగం చేసుకుని ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కెనరా బ్యాంకువిజయవాడ సర్కిల్ ఆఫీస్ ఏజీఎం రవికుమార్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సెంటర్ ప్రమోషన్‌అధికారి రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారంరమణయ్యపేట ఐడీఏ పొల్యూషన్ నియంత్రణ మండలి కార్యాలయంలో కాకినాడ కెనరా బ్యాంకు రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ (ఎంఎస్ఎంఈ) క్లస్టర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళావికాస స్కీమ్ మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈసందర్భంగా చిన్నతరహా వ్యాపారాలు, పరిశ్రమల స్థాపన, వర్కింగ్ కేపిటల్, కొత్తపరికరాలు, యంత్రాల కొనుగోలు, పెట్టుబడి, వాహనాలు, ముడిపదార్థాలు తదితర వాటి కోసం ఎంఎస్ఎంఈలో రుణాలు తదితర ఎంఎస్ఎంస్కీమ్‌లపై అవగాహనకల్పించారు. కెనరాబ్యాంకు రీజినల్‌హెడ్ గణేష్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ మీట్

సామర్లకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించే సామర్లకోట మండలం, పట్టణం పరిధిలో 75ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య వెల్లడించారు. ఇందుకోసం మండలానికి రూ.1.70లక్షల నిధులను ప్రభుత్వం నుంచి ఎంఈవోలకు విడుదల చేయడంతో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆ నిధులను ఎంఈవోలు అందజేసారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలల్లోనివిద్యా సంబంధ మౌలిక వసతులు, లభ్యత, వాడకం, మధ్యాహ్న భోజనపథకం, విద్యార్థి ఆరోగ్యస్థితి, రోజూవారి విద్యార్థుల అకడమిక్ అంశాలు చర్చిస్తారు. శుక్రవారం మండలంలోని ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్‌కు సంబంధించి ఏర్పాట్లను ఎంఈవో శివరామకృష్ణయ్య పర్యవేక్షించి హెచ్ఎంలకు సూచనలు చేశారు.

అక్రమ లేఅవుట్లలో నోటీసు బోర్డులు

తాళ్లరేవు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం, తాళ్లరేవులో గల అక్రమ లేఅవుట్లలో పంచాయతీ అధికారులు శుక్రవారం నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. పంచాయతీ, రెవెన్యూ ఇతర శాఖల అనుమతులు లేకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా లేఅవుట్లు ఏర్పాటుచేయడం చట్టవిరుద్ధమన్నారు. వాటిని ఎవ్వరు కొనుగోలు చేయరాదన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వినయ్‌తేజ



పెద్దాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఏడో అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెద్దాపురానికి పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది గన్నంరాజు వినయ్‌తేజనియమితులయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలను తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి





పెద్దాపురంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడలో ఎమ్మెల్యే కొండబాబు, కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎంపీ పళ్లంరాజు, గొల్లప్రోలు: మల్లవరంలో మాజీ ఎమ్మెల్యే వర్మ నివాళి

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

పెద్దాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అరీఫ్ ఆలీ పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో మాధవరావు, డీటీలు భానూకుమార్, విజయకుమారి పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దారపురెడ్డి క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ పాల్గొన్నారు. వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు, (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ భవనం, తహసీల్దార్ కార్యాలయం, సామాజిక ఆసుపత్రి,మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహాలకు దళితనేతలు నివాళులర్పించారు. అలాగే దళిత గ్రామాల్లో వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు.

కొత్తపల్లి, (ఆంధ్రజ్యోతి): దేశం ఉన్నంత కాలం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనే పదం అంతర్లీనంగా ధ్వనిస్తుందని పీవీరావు మాలమహానాడు కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రాంజీ కుమార్, అంబేడ్కర్ యంగ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ దాకే సింహాచలం అన్నారు. యండపల్లి జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మచ్చా భాను, మాక అరవింద్, పలువురు గ్రామ పెద్దలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

కరప, (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో శుక్రవారం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు గుబ్బల రామకృష్ణ, సర్పంచ్‌లు రొక్కాల గణేష్, సాదే ఆశాజ్యోతి, మారెళ్ల శివ, సవిలే నీలిమారాజేష్, వజ్రపు కామేశ్వరరావు పూలమాలలువేసి నివాళ్లర్పించారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏవో బీఎల్ నరసింహం, తలాటం సుబ్రహ్మణ్యం, ఎంబీఎస్ రామలక్ష్మి, కార్తీక్, వీఆర్‌వో కుంపట్ల గోపాల్, ఎం.సుజాత, ఎం.గోపి, వనుం భాస్కర్, రమణ తదితరులు నివాళులర్పించారు.

కాకినాడసిటీ, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేడ్కర్ గొప్ప దార్శనీకుడని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, నాయకులు దవులూరి ధనకోటి, పిల్లి చిన్న, పబ్బినీడి కృష్ణ, వనుము రమణ పాల్గొన్నారు.

కాకినాడసిటీ, (ఆంధ్రజ్యోతి): బహుజన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ స్వాప్నికుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. భారత రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత జగన్నాథపురం కుంతీదేవి పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గదుల సాయిబాబు, బచ్చు శేఖర్, పిల్లి శివకుమార్, కొల్లాబత్తుల అప్పారావు, సీకోటి అప్పకొండ, బచ్చుల కామేశ్వరరావు, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, పాలిక నాని పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ), (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అన్ని వర్గాలు ఐక్యం కావాలని, భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి దేశంలో సకల జనులకు ఆ ఫలాలు అందించడమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఇచ్చే ఘన నివాళి అని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ, బుద్ధ విహార్ అధ్యక్షుడు డాక్టర్ కె.బాబ్జి అన్నారు. కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో భారత రాజ్యాంగం విశిష్టత అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ కాదా వెంకటరమణ, సీనియర్ అడ్వకేట్ జవహర్ అలీ, సీనియర్ ఫ్రీ లాన్స్ జర్నలిస్టు మలసాని శ్రీనివాస్, సీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దళాల సుబ్బారావు, బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాముడు పాల్గొన్నారు.

పిఠాపురం, (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు అన్నారు. పిఠాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని రథాలపేట అంబేడ్కర్ సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహాగర్జన. మాలమహానాడు అధ్యక్షుడు దానం లాజర్‌బాబు, బీఎన్ రాజు, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, విగ్రహానికి కాకినాడ మాజీ ఎంపీ, వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీతావిశ్వనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ వర్ధినీడి సుజాత, వైస్‌చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు, రైల్వేస్టేషన్ మాస్టర్ నాగబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సాకా రామకృష్ణ, వివిధ సంఘాల నాయకులు రాంబాబు, లోడ సుదర్శన్, దడాల అజిత్ పాల్గొన్నారు. రథాలపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఖండవిల్లి చినలోవ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్బన్ సొసైటీ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, ముమ్మిడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ చెల్లూరి లోవరాజు, సీకోలు శ్రీను, యాదాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన బాటలోనే కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం పనిచేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. మల్లవరంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, ఉలవకాయల దేవేంద్రుడు, మురళీ, పిట్టా రాంబాబు, వీరయ్య, మల్లిబాబు, లచ్చబాబు, మల్లిపూడి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. దుర్గాడలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్ధాంతపు ధర్మరాజు, ముర్రే మణిరాజు, డి.రమేష్, శ్రీను, ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయం ఆవరణలోని శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవో కర్రి స్వప్న, పలువురు అధికారులు, సిబ్బంది పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది.

కార్పొరేషన్(కాకినాడ), (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. విశ్రాంత ఇంజనీర్ పిల్లి రామారావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

జేఎన్టీయూకే, (ఆంధ్రజ్యోతి): వర్సిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం జేఎన్టీయూకే ఎస్సీ, ఎస్టీలైజనింగ్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీరమణ నివాళులర్పించారు. ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

సామర్లకోట, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, నేడు అన్ని వర్గాల వారు ఉద్యోగాలు పొందారంటే అది అంబేడ్కర్ కృషి మాత్రమేనని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ అన్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ చిత్రపటానికి రమేష్, రైల్వే అధికారులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎస్ఎస్ పి.అనంతలక్ష్మి, జీఆర్పీ ఎస్ఐ బి.లోవరాజు, రామకృష్ణ, జి.గణేశ్వరరావు, వైఎన్.బాబు, జీమెచ్ రామకృష్ణ, కళ్యాణి, తేజేశ్వరరావు, శ్రీధర్, చైతన్య, నాగార్జున, కేవీ గిరి, రవికాంత్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కాకినాడసిటీ, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో ఖ్యాతినార్జించిన మహనీయుడు అంబేడ్కర్ అని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎన్జీవో హోంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్ఎంకేజీ ప్రసాద్, కాకినాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పాల్గొన్నారు. అన్నమ్మఘాటీ సెంటర్‌లో దళిత గిరిజన బీసీ ముస్లిం క్రైస్తవ వేదిక వ్యవస్థాపకుడు డోకుబుర్ర భద్రం మాస్టారు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

అర్హుల గుర్తింపులో పారదర్శకంగా వ్యవహరించాలి

గొల్లప్రోలు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్వంత స్థలాలు ఉండి గృహాలు నిర్మించుకునేందుకు ఆసక్తి గల అర్హులను గుర్తించడంలో పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని గృహ నిర్మాణశాఖ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో కర్రి స్వప్న సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ ఆసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా 2.0లో భాగంగా పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. హౌసింగ్ ఏఈ రాజేశ్వరీ పాల్గొన్నారు.

13న అరుణాచలం యాత్ర స్పెషల్ సర్వీసు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి ఈనెల13న ఉదయం 11గంటలకు అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు బయలుదేరుతుందని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. మూడు రోజుల యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి తిరిగి 16న తిరిగి కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈయాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి చూపిస్తారన్నారు. ఒక్కొక్కరికి రూ.3100 చొప్పున టిక్కెట్ నిర్ణయించామన్నారు. వివరాలకు 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

కాకినాడసిటీ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సంజయ్‌నగర్‌లోని పిడుగులమ్మ తల్లి ఆలయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు జిల్లా అధికారులకు, పోలీస్ అధికారులకు శుక్రవారం వినతిపత్రాలు అందించారు.

వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

రౌతులపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావును కాకినాడ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ సత్కరించారు. శుక్రవారం సాంబశివ రావును మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఊటా నాగశ్రీను, యాదగిరి వెంకటరమణ, లవుడు శ్రీను పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అంబేద్కర్ సేవలను స్మరించుకోవాలి

● ఎమ్మెల్యే శిరీష దేవి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శిరీష దేవి

రంపచోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను వర్ధంతి పురస్కరించుకొని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ సేవలను ప్రతిఒక్కరు స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళితపార్టీల నాయకులు మాదే రా మచంద్రరావు, జయరాజు, పి.మోహన్, ఎ.బాపిరాజు, పి.శ్రీనివాస్‌రావు గణపతి, డి.జనార్ధన్, షేక్ ఇబ్రహిం, చక్రపాణి, ఎస్.సత్యవతి, సింహాద్రి, ఎస్.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి ఏపీఎస్ఈబీ ఎస్సీఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, పోలవరం డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దేవీపట్నం: మండలంలోని కొండమొదలు పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పెద్దభీంపల్లి ఎంపీపీ స్కూల్ వద్ద శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కుండ్ల సాయిరాం, నడిపూడి గణపతిరెడ్డి, నడిపూడి భానుశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కుంజం చిన్నబ్బాయిదొర, కారం బుజ్జిబాబుదొర, పీఏ స్వామి, ఎస్ఎంసి చైర్మన్ నడిపూడి లక్ష్మిగంగాభవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు: డా. బీఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని సీపీఎం మండల స్థాయి కార్యదర్శి పల్లపు వెంకట్ కోరారు. శుక్రవారం చింతూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.నాయకులు సీసంసురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని ఎంపీడీవో కార్యలయ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోర్త అప్పారావు, మండల అధ్యక్షుడు పెద్దాడ నూకరాజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం వీడాలి '

చింతూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని వీడాలని సీపీఎం మండల స్థాయి కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. దీంతో బోధనకు ఆటంకం చోటుచేసుకుందన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు. సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పొడియం లక్ష్మణ్, పత్రా రమేష్, బీరబోయిన దిలీప్, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో ఐటీడీఏ పీవో పెరేడ్ డే కార్యక్రమం

మోతుగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం చింతూరు మండలం మోతుగూడెం మార్కెట్ సెంటర్ నుంచి గణేష్ టెంపుల్ వీధి వరకు పెరేడ్ డేలో భాగంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, పోలవరం డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా తిరుపతమ్మ రంగురాళ్ల క్వారీ

అడ్డతీగల, డిసెంబరు6: అడ్డతీగల మండలంలో అక్రమ రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, న్యూ, అటవీశాఖ పోలీస్ యంత్రాంగం ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల. బాబురావు ఆరోపించారు. మండలంలోని మల్లవరం మామిళ్ళ గ్రామానికి ఆనుకొని అటవీ ప్రాంత సరిహద్దులో ఉన్న తిరుపతమ్మ క్వారీలో అక్రమ రంగురాళ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నపటికి అధికారులు స్పదించకపోవడం వెనుక అంతరార్ధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తిరుపతమ్మ అనే మహిళకు సంబంధించిన భూమి అటవీభూమికి సరిహద్దులో ఉందన్నారు. ఈ ప్రాంతంలో రంగురాళ్ల లభ్యమవుతున్నాయన్న విషయం తెలుసుకొన్న నర్సీపట్నంకు చెందిన దళారీలు, గిరిజనేతరుడు అయిన ఒక వ్యక్తి దుప్పుల పాలెం గ్రామానికి చెందిన గిరిజనుడిని బినామీగా పెట్టి అక్రమ రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

మూడు రాష్ట్రాల స్థాయి క్రీడా సంబరాలు

చింతూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం క్రీడా పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడారు. ఈనెల 12 నుంచి చింతూరులో క్రీడా పోటీల సంబరాలు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. క్రికెట్, వాలీబాల్, విలువిద్య తదితర పోటీలు నిర్వహి స్తామన్నారు. క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని జమాల్‌ఖాన్ కోరారు.

సొంత అవసరాలకే వాగులు, రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లాలి

● ట్రాక్టర్ యజమానులతో సమావేశం

ఎటపాక, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానికులు సొంత అవసరాలకే స్థానికంగా ఉండే వాగులు, నోటిఫైడ్ శాండ్ రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకెళ్లాలని, తహసీల్దార్ కారం సుబ్బారావు ట్రాక్టర్, ఎడ్ల బండ్ల యజమానులకు సూచించారు. శుక్రవారం ఎటపాకలో ఉచిత ఇసుకపాలసీ విదానంపై ట్రాక్టర్ యజమా నులకు తహసీల్దార్ సుబ్బారావు, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కెపార్థసారధి అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఇసుక రవాణా చేసుకోవాలని సూచించారు. ఉచితం పేరు తో అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

వై.రామవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం వై.రామవరంలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. బాల్యం ఎంతో విలువైనదని ఆసమయంలో బాల్య వివాహాలు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని తల్లిదండ్రులు దీనిపై అవగాహన కల్పించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న, అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రజల సదస్సు జయప్రదం చేయండి

చింతూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన పరిహారం కోసం ప్రతి నిర్వాసితుడు ఉద్యమ బాట పట్టాలని సీపీఐ మండల కన్వీనర్ తుర్రం మురళి డిమాండ్ చేశారు. పోలవరం ముంపు ప్రజల సదస్సును ఈనెల 10న ఏలూరు జిల్లా వేలేరుపాడులో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చింతూరులో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు.

కేన్సర్ వ్యాధితో బాలిక మృతి


పొడియం మనీషా (ఫైల్)

ఎటపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకుంట పంచాయతీలోని రాఘవపురం గిరిజన గ్రామానికి చెందిన పొడియం మనీషా (16)కేన్సర్ వ్యాధితో గురువారం రాత్రి మృతి చెందింది. మనీషా చింతూరు మండలం బొడ్డుగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సమ యంలో గత ఏడాది కేన్సర్ వ్యాధి బారిన పడింది. అప్పటి నుంచి మనీషాను హైదారాబాద్ బసవతారం కేన్సర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మనీషా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. తరచూ హైదారాబాద్‌కు వెళ్లే ఆర్థిక స్తోమత లేక గత ఏడాది సమయంలో ఐటీడీఏ పీవోను కలిసి, ఆర్థిక సాయంతో పాటు వైద్య సాయం చేయాలని విన్నవి ంచినట్టు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. పీవో బాలికకు సాయం చేయాలని ఆదేశాలిచ్చినా డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో పట్టించుకోలేదని, ఆయన వద్దకు పలుమార్లు వెళ్లినా ఎటువంటి సాయం చేయలేదని, దాంతో వైద్యం అందక తన కూతురు మృ తి చెందిందని బాలిక తండ్రి శ్రీను ఆరోపించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యనమల, దళిత నాయకులు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన యనమల అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందడుకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఒంటిమామిడి సర్పంచ్ అంగుళూరి సుధాకర్, దళిత నాయకులు కూరపాటి రఘు, బోడపాటి శ్రీను, పెదపాటి గవరయ్య, బోడపాటి అప్పారావు, సోమాల ప్రసాద్, పిల్లి బాబ్జిలతోపాటుగా కూటమి నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు,చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, దంతులూరి శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

● తేటగుంట అంబేద్కర్ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దళిత నాయకులతోపాటు యూత్ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ కడిమి ప్రసాద్, మాసా దుర్గారావు, కడిమి లోవరాజు, ఎం.శివ, సీకోలు సింహాచలం,రమణ ఉన్నారు.

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, లచ్చిరెడ్డిపాలెం, మూలగపూడి, బలరామపురం గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. బర్రే రాజేశ్వరరావు, యుటీఎఫ్ నాయకులు కె. హరిబాబు, సింహచలం, జి.అప్పారావు. బి.అప్పారావు, సీహెచ్.కుమారి, ఈ. చినమ య్యా పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ నేతృత్వంలో పూలమాలలు వేసి నివాలులర్పించారు. కావలి శ్రీను, జగదీష్, పేకల జాన్, గణేష్, బొండు ఈశ్వరరావు, రాయుడు చిన్న, కుప్పల నాగభూషణం ఉన్నారు.

జగ్గంపేట: క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డాక్టర్ శ్రీ సత్యాడ జార్జి బాబు, మండలం కో ఆప్షన్ సభ్యుడు జాన్ వెస్లీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్ సెక్రెటరీ ఎన్. విజయరాజు, ఐ శాలెంరాజు పాల్గొన్నారు

●శుక్రవారం హైస్కూల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నాయకుడు రావుల గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, పోట్రు వీర్రాజు, గడ్డం వెంకన్న, గుర్రం మహాలక్ష్మి, అబ్బిరెడ్డి వీరబాబు పాల్గొన్నారు

ప్రత్తిపాడు: దేశంలో అంటరాని తనం రూపుమాపిన మహనీయుడు అంబేద్కర్ అని మాజీ డీసీసీబీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలో శుక్రవారం అంబేద్కర్ చిత్రపటానికి మురళీకృష్ణంరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, కోలా తాతబాబు, శ్రీను, శివ పాల్గొన్నారు.

తొండంగి: అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం శృంగవృక్షంలో ఘనంగా నిర్వహించారు. జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయ్యల సూర్యారావు, బుర్తి అప్పారావు, నేపా కృష్ణ, మచ్చ సుబ్బారావు, చెక్క భీమరాజు, దుత్తరపు సత్తిబాబు పాల్గొన్నారు.

షష్ఠి వేడుకలకు కాత్రావులపల్లి సిద్ధం

జగ్గంపేటరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రావులపల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలకు సర్వం సిద్ధమైంది. కాత్రావులపల్లిలో సుబ్రహ్మణ్యస్వామి వేడుకలు భారీ ఎత్తున జరుగుతాయి. ఈ వేడుకలకు చుట్టుప్రక్కల పలుగ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం హాజరవుతారు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆలయ కమిటీకి పలు సూచనలు ఇచ్చారు. క్యూలైన్లు, ట్రాఫిక్ సమస్యలపై, జాతరకు సంబంధించి కమిటీకి తగు జాగ్రత్తలు సూచించారు.

సుబ్రహ్మణ్యుడు పెళ్లికొడుకాయనే

శంఖవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి పెళ్లికొడుకైన వేళ ఊరూవాడా పులకరించింది. సుబ్రహ్మణ్యేశ్వస్వామివారి దివ్యకల్యాణోత్సవంలో భాగంగా మండలంలో స్వయంభూగా వెలసిన కత్తిపూడి, శంఖవరం గ్రా మాలలో భారీస్థాయిలో కల్యాణ ఏర్పాట్లుచేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో శంఖవరంలో పాలకావిడి మహోత్సవం కనులపండువగా జరిగింది. నేడు జరిగే కల్యాణోత్సవానికి అలంకరణలు చేశారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

భవిత సెంటర్‌ను పరిశీలించిన ఏపీసీ

తొండంగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వ శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వేణుగోపాలరావు శుక్రవారం తొం డంగి భవిత సెంటర్‌ను, నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రదర్శించిన కృత్యాలను తిలకించారు. గృహ ఆధారిత విద్యపై సిబ్బందిని ప్ర శ్నించారు. దివ్యాంగులకు మెరుగైనసేవలు అందించే విధంగా కృషిచేయాలని సూచించారు. అంతకు ముందు ఆయన వాకదారిపేట కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జీసీడీవో ఉమామహేశ్వరి, ఏఎస్‌వో రాంబాబు, ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి రాజేశ్వరి, ఐఈఆర్టీలు నాగేశ్వర్రావు, జగన్నాధం, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు బహుమతుల ప్రధానం

ఏలేశ్వరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భవితా కేంద్రంలో దివ్యాంగులకు బహుమతులు శుక్రవారం ప్రధానం చేశారు. దివ్యాంగుల దినోత్సవం పురష్కరించుకొని పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తహశీల్దార్ వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, ఎంఈవో అబ్బాయి బహుమతులు అందజేశారు. దివ్య మేఘన, ఏసుబాబు, వాణి పద్మజ, బుజ్జి ఉన్నారు.

పీహెచ్‌సీల్లో విధులకు వైద్యులు సకాలంలో హాజరుకావాలి

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

దేవీపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పీహెచ్‌సీలకు సంబంధించిన వైద్యాధికారులు సకాలంలో విధులకు హాజరుకావాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం పీవో దేవీపట్నం మండలం వెలగపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా ఈ ఆసుపత్రిలో ఎంత వైద్యాధికారులు, సిబ్బంది ఉన్న దానిపై ఆరా తీశారు. వైద్యాధికారులు విధులకు సకాలంలో హాజరుకానందున వారికి నోటీసు జారీ చేయాలని ఏడీఎంహెచ్‌ఓకు ఆదేశించారు. అన్ని పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు.

వివాహాలకు నెహ్రూ ఫౌండేషన్ పెళ్లి కానుక


నవవధువుకు పెళ్లి కానుక అందజేస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నవ వధువు లకు రూ.2లక్షలను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. నియోజక వర్గంలోని నాలుగు మండలాలలో జరిగిన 10 వివాహాలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ అందిస్తున్న పెళ్లికానుక ఒక్కొక్క నవవధువుకు రూ20వేలు చొప్పున రూ.2లక్షల చెక్కులను అందించారు. జ్యోతుల నవీన్ మండలంలోని కాట్రావుపల్లి గ్రామానికి చెందిన పి.వీరలక్ష్మికి, గుర్రంపాలెం గ్రామానికి చెందిన వై.సంయుక్తకి, రాజపూడి గ్రామానికి చెందిన జి.భార్గవిదేవికి, గండేపల్లి మండలం కె.గోపాలపురానికి చెందిన ఎం.దుర్గాదేవి, సూరంపాలెం గ్రామానికి చెందిన పి.అఖిలకి, మల్లేపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ వీరవేణి, కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన కె.జానకి, గోకవరం మండలానికి చెందిన మరో ముగ్గురు నవదంపతులకు మొత్తం పదిమంది దంపతులకు రూ.2లక్షలు అందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నియోజక వర్గంలో పేద ఆడ బిడ్డలకు వివాహ సమయంలో రూ.20వేల పెళ్లికానుక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌ద్వారా అందిస్తున్నామని, పెళ్లికి తొమ్మిది రోజులు ముందు ఫౌండేషన్ కార్యాలయానికి శుభలేఖ, ఆధార్ కార్డు, వివరాలతో కూడిన దరఖాస్తు అందించాలని తెలిపారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల నిరసన


ప్రత్తిపాడలో మానవహారం నిర్వహిస్తున్న జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు శుక్రవారం చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు కంచాలు మోగించి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో మానవహారం నిర్వహించి జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులను కొనసాగించాలని ఆందోళన చేశారు. నవంబరు16న అర్థాంతరంగా కంపెనీ మూసివేసి కార్మికులను నడిరోడ్డుపై ఉపాధి లేకుండా చేశారని గత 21రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నా జీడిపిక్కల కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆందోళన చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, అనిశెట్టి వీరబాబు, గోవిందు, ధర్మాజీ, ఆది, రామదుర్గ, అన్నపూర్ణ, నాగలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

'ఇండస్ట్రియల్ పార్క్ ఆలోచనను విరమించుకోవాలి'



ఆందోళన చేపడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

జగ్గంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని మల్లిసాల, కె.గోపాలపురం మధ్యలో ఉన్న అడ్డుకొండ భూమిని రెండు గ్రామాల ప్రజలకు పంపిణీ చేయాలని శుక్రవారం అడ్డుకొండ భూముల్లో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ భూమిని రెండు గ్రామాల ప్రజలకు పంపిణీ చేయాలని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మనారు. ఈ భూమిని బడా భూస్వాములు ఆక్రమించకుండా పోరాటం చేస్తున్నామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి స ంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, రైతుకూలీ సంఘం నాయకులు రామ లింగేశ్వరరావు, సురేష్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

1064 వరి ఎకరానికి 43 బస్తాల దిగుబడి


పంట కోత నిర్వహిస్తున్న దృశ్యం

తుని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంటీయూ 1064 వరి రకంలో వ్యవసాయశాఖ అధికారులు పంట కోత నిర్వహించగా ఎకరానికి 43 బస్తాల దిగుబడి వచ్చినట్లు ఏఈవో జగ్గ అప్పారావు తెలిపారు. తుని మండలం డి.పోలవరం గ్రామంలో పంట కోత నిర్వహించామని ఆయన తెలిపారు.

లబ్ధిదారులకే ఉచిత ఇసుక : తహసీల్దార్

వై.రామవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో గృహనిర్మాణ పథకం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకే ఉచిత ఇసుక అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. మండలంలో ఇటీవల దేవరమడుగుల బ్రిడ్జి కింద ప్రమాదభరితంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లపై రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందని అనుమతులు ఉన్న వారికి చలానా కట్టించి వాటిని రిలీజ్ చేయడం జరుగుతుందన్నారు. అయితే మైదాన ప్రాంతాల్లో గోదావరి ఇసుక రీచ్‌ల్లో కాంట్రాక్టర్లు ఇసుక తరలింపు విధానం ఉందని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న వాగులవద్ద ఇసుక పరిమితంగా ఉంటుందని దీనిని దృష్టిలో పెట్టుకుని మండలంలో 1130 గృహ నిర్మాణలబ్ధిదారులకు జీవో నెం 49/2024 ప్రకారం స్టేజ్ 4,5 ప్రకారం ఇసుకను గృహ నిర్మాణశాఖ నుంచి అనుమతి పొందిన లబ్ధిదారులకు ఉచిత ఇసుకను అందించడం జరుగుతుందన్నారు.

ఘనంగా నాగమ్మ ఊరేగింపు

వై.రామవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): షష్ఠి మహోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శ్రీగణపతి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నాగమ్మ అమ్మవారి విగ్రహాన్ని పలు వీధుల్లో ఘనంగా ఊరేగించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం నిర్వహిస్తున్నందున ఈ ఊరేగింపు జరిపినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


శంఖవరంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

శంఖవరం, డిసెంబరు 6: (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎరువులు పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.స్నేహలత ఆధ్వర్యంలో స్థానిక ఇందుఆగ్రో ఏజెన్సీస్‌పై దాడులు నిర్వహించగా సరుకు నిల్వలో వ్యత్యాసాలు గుర్తించి యజమానిపై 6ఏ కేసు నమోదుచేసి రూ. 1,34,213 విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. పారామెక్స్ పురుగుల మందులపై విక్రయధర లేనందున సంబంధిత కంపెనీపై లీగల్‌మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు వెంకటనాగరాజు, నవీన్‌కుమార్, వీరబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ లియో దినోత్సవం

గండేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో శుక్రవారం అంతర్జాతీయ లియో దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ, సామాజిక పాలన పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేగంగా మారుతున్న నేటి ప్రపంచంలో ఈఎస్‌జీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆఫ్ ఫైనాన్స్ సీహెచ్ కృష్ణకిషోర్ పాల్గొని విలువైన సలహాలు అందించారు. ఆదిత్య యూనివర్శిటీ ప్రెష్‌మ్యాన్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ వనతి, లయన్ మోహన్, లియో కోఆర్డినేటర్లు ఎస్.నరేష్, పి.అన్నపూర్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఆయుర్వేద వైద్య శిబిరం

మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆయుర్వే వైద్యశిబిరం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని విజయవాడకు చెందిన పిళ్లయార్ ఆయుర్వేద వైద్యులు గ్రంధి గాంధీ సత్యప్రశాంత్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర, డ్రైవర్లు, క్లీనర్లు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు తగిన సలహా సూచనలు అందించి ఉచితంగా మందులు అందించినట్లు రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు.

మార్కెట్ రేటు కంటే ఎక్కువ రేటుకే భూములు కొన్నా

● మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క రైతు నుంచి భూమిని లాక్కోలేదని మార్కెట్ రేటు కంటే సెబ్ భూములు ఎక్కువకే కొన్నానని మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజా విలేఖరుల సమావేశంలో స్పష్టం చేశారు. వైసీపీలో ఉంటే భూములు కొనకూడదా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు అమరావతిలోను, పవన్‌కల్యాణ్ పిఠాపురంలోని భూములు కొనుక్కోవడం వాస్తవం కాదా అన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం సేకరణలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వం ధాన్యానికి కనీస ధర ఇవ్వడంలేదని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ వసతిగృహం పరిశీలన

రౌతులపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి ఇంటి గ్రేటెడ్ వసతి గృహాన్ని శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంగా సూరిబాబు, జిల్లా కార్యదర్శి పోలోజు వరహాలు పరిశీలించారు. తాగడానికి నీరులేదని, బాత్‌రూమ్‌కి పట్టే నీరే విద్యా ర్థులకు అందిస్తున్నారని ఆ నీరు తాగడంవలన విద్యార్థులు అనారోగ్యానికి గురతున్నారన్నారు. బాత్‌రూమ్‌లకు తలుపులే వని, కిటికీలకు తలుపులేకపోవడంతో చలితోపాటు దోమలతో 120 మంది విద్యార్థులు బాధలుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

ప్రత్తిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పాదాలమ్మగుడి సమీపంలోని అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి శుక్రవారం చోరీకి గురైంది. రైతు కుక్కుటేశ్వరరావు శబరిమల దర్శనానికి వెళ్లగా ఆయన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రిని గుర్తు తెలియని దుండగులు అపహరించారు. విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు.